


బస్సు కదిలింది.

పది సంవత్సరాల తర్వాత తిరిగి బందరెళుతున్నాను. బందరు నేను పుట్టి పెరిగిన ఊరు.

డిగ్రీ పుచ్చుకొన్నాక హైద్రాబాదు చేరుకున్నాను. ఉద్యోగం చేస్తూనే 'లా' డిగ్రీ కూడా సంపాదించుకుని హైద్రాబాదులోనే ప్రాక్టీసు పెట్టాను. నాన్నగారు పోవడం, మా ఆస్తిపాస్తులన్నీ దాయాదుల పరం అయిపోవడంతో నేను హైద్రాబాదులోనే స్థిరపడిపోవాల్సి వచ్చింది

ఇంతకాలం తర్వాత తిరిగి పుట్టి పెరిగిన వూరు వెళుతున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది. మామయ్య కూతురి పెళ్ళి. 'జ్యోతి'ని 'బుజ్జి' గాడ్ని కూడా తీసుకు రమ్మని మామయ్య రాశాడు.

కాని బందరుకి పదిమైళ్ళ దూరాన గల పల్లెటూరు మామయ్యది. వానా

కాలం అవడంచేత 'జ్యోతి' అవస్థపడుతుందని తీసుకురావడంలేదు.

తీసుకురాలేదని 'జ్యోతి' కి చాలా కోపం వచ్చింది. పల్లెటూళ్ళ సంగతి తనకి తెలీదు. సిటీలో పుట్టిపెరిగింది జ్యోతి. తను అవస్థపడ్డం నేను సహించలేను. తను నన్నొదిలి ఒక్కక్షణం వుండనంటుంది. తన పంచప్రాణాలు నామీదే అంటుంది.

జ్యోతిచేత 'లా' పూర్తిచేయించి నా దగ్గర జూనియర్‌గా పెట్టేసుకోడం మంచిదనిపిస్తోంది.

బస్సు పోతోంది.

తియ్యటి అనుభూతులు, పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి.

బస్సు విజయవాడ దాటి బందరు రోడ్డుపైన పరుగెడుతూవుంటే మనసుకి వుల్లాసంగా వుంది.

అప్పటికీ ఇప్పటికీ కాలం మారినా ఆ పరిసరాలు మాత్రం ఏమీ మారలేదు ఉదయం ఏడవుతుండగా బస్సు బందరు చేరుకుంది. కంపరకొట్ల దగ్గర బ్రీఫ్‌కేస్ పట్టుకొని దిగాను

నన్నెవరన్నా గుర్తుపడతారేమోనని ఆశగా చూశాను. ఆశ నిరాశే అయింది. పదేళ్ళ తరువాత వూళ్ళో అడుగుపెడితే అప్పటికిప్పుడు నన్నెలా గుర్తుపడతారని ఆశపడాలి.

అక్కడ కొత్తగా కట్టిన సినిమా థియేటర్ "రాధిక" నాకు స్వాగతమిస్తున్నట్టుగా కనబడింది. మావూర్లో అంత అందమైన థియేటర్ వెలిసినందుకు నాకు చాలా గర్వంగా అనిపించింది.

రిక్షావాళ్ళు నన్ను చుట్టుముట్టేరు. వాళ్ళని తప్పించుకొని కోనేరు సెంటర్ దగ్గరకి చేరాను.

నాకా వూళ్ళో ఎవరున్నారు? ఎక్కడ దిగాలి?

అన్నీ ప్రశ్నలే ఎదురైనాయి.

బందర్లో అన్నిరకాల బజార్లూ సమ్మేళనగా ఒకేచోట వుంటాయి.

బస్టాండు ఎదురుగా వున్న ఇంద్ర భవన్లో బస చేసాను.

చిన్నప్పుడు నాన్నగారితో ఆహోటల్‌కి చాలాసార్లు వెళ్ళేను. నాన్నగారితో కలసి ఆ హోటల్లో గులాబ్ జామ్ తిని, కాఫీ తాగిన రోజులు గుర్తుకొచ్చేయి.

నాకెందుచేతో ఆ వూళ్ళో అడుగుపెట్టిన దగ్గర్నించి నాన్నగారు గుర్తుకొస్తున్నారు కొండంత అండగా నిలిచి నన్ను ప్రాణాధికంగా చూసుకొన్న దేవుడు నాన్నగారు. ఆయన పోయేక ఈ ప్రపంచమంతా నాకు అంధకారం అయిపోయిందనిపించింది.

స్నానంచేసి బట్టలు మార్చుకొని ఎదురుగా వున్న సైకిల్ షాపులో ఓ సైకిల్ అద్దెకి తీసుకున్నాను. సైకిల్ తొక్కి పదిసంవత్సరాలయింది. వూరుని

ప్రతి అంగుళం పట్టి చూడాలనుంది నాకు

మా ఇంటివైపుకి సైకిల్ పోనిచ్చాను. ఎత్తుస్తంభాల డాబా అలానే వుంది

నాన్నగారు పోయేక ఆ ఇల్లు అద్దెకిచ్చేసి అందరం హైద్రాబాదు చేరిపోయాం. ఆ వూళ్ళో మాకంటూ చెప్పుకోడానికున్నది ఆ ఇల్లు ఒక్కటే.

నేను ఫలానా అని చెప్పుకొని ఆ ఇల్లంతా ఓసారి చూసుకొన్నాను నా కా క్షణంలో ప్రాక్టీస్ హైద్రాబాద్‌నుంచి బందరు మార్చేయాలనుంది.

ఆ ఇల్లు మా నాన్నగారు కట్టేరు. ఆ ఇంట్లో నాన్నగారు నలభై ఏళ్ళు నివసించేరు. వున్నంతకాలం ఆ రోడ్డుమీద నడిచేరు. కర్చీఫ్‌తో కళ్ళొత్తుకున్నాను. తిరిగి రోడ్డుమీద కొచ్చాను బందరు రోడ్డంట సైకిల్ పోనిచ్చాను.

చిన్నప్పుడోసారి లాంబాయి కాల్వలో స్నానం చేస్తుంటే ఎవరో తన బట్టలెత్తుకపోయారు. ఆ రోజు మామయ్య వచ్చేడు.

బట్టల్లేకుండా ఇంటికొచ్చిన నన్ను వావ చితకబాదాడు మామయ్య

నేనేం చేసినా సమర్థించేవాళ్ళు నాన్నగారు.

మామయ్య నన్ను కొట్టాడని తెలిసి మండిపడ్డారు నాన్నగారు.

కాలేజీ దగ్గరకెళ్ళాను కాలేజీ ఎదురుగా చంద్రంబాబాయ్ హోటల్ వుండి. ఇప్పుడా డాబా ఇంట్లో కాక కింద పక్కగా తడికెలతో కట్టిన లోగిల్లో చంద్రం హోటలుంది. చంద్రం బాబాయ్ మారుతున్న కాలంతో ఓమెట్టు పైకి పోవల్సింది పోయి మెట్టు కిందికి దిగాడనిపించింది.

చంద్రం నన్ను అవలీలగా గుర్తు పట్టేసి,

"ఒరే రంగా," అన్నాడు. నన్ను అమాంతం కౌగిలించేసుకున్నాడు. నన్ను చూసిన ఆనందంతో చంద్రం కళ్ళలో నీరు సుడులు తిరిగింది.

"ఎలా వున్నావ్?" అన్నాను

అంటూనే అతన్ని పరీక్షగా చూసేను.


వయసుతోపాటు ముసలితనం వచ్చేసింది చంద్రంకి. ఒకప్పుడు పెద్ద ఫుట్‌బాల్ ఆటగాడు చంద్రం. అప్పట్లో అరడజను మందిని అవలీలగా కొట్టేయగలిగేవాడు. ఆ దర్పం ఆ ఠీవి చంద్రం బాబాయిలో ఇప్పుడు నాక్కనిపించలేదు.

"మంచితనం, నమ్మకం అన్నీ పాతోనే పోయినయిరా. నీలాంటివాడు మెచ్చుకోకడు మిగిల్తే ఈ వూళ్ళో నాలాంటివాళ్ళకి ఆసరా వుండేది."

అన్నాడు చంద్రం.

చంద్రం బాబాయ్ కాఫీ కలిపిచ్చాడు.

గర్వంగా నేను చదువుకొన్న కాలేజీ కేసి చూసాను లోపలికెళ్ళి నా గురు




వైన తెలుగు లెక్చరర్ వెంకట్రామయ్య గార్ని కలుసుకున్నాను.

ఆయనకి నేనంటే ప్రాణం. నన్నేకసార్లు చాలా ట్రబుల్స్‌నించి కాపాడిన దేవుడాయన.

తర్వాత,

యన్. హెచ్. బ్లాక్‌దగ్గర రెండు నేరేడు చెట్లకింద కాసేపు నించొన్నాను. పి.యు.సి. చదివే రోజుల్లో ఆ నేరేడు చెట్టు ఎక్కినందుకు ప్రిన్సిపాల్‌గారు నాకు రెండురూపాయలు ఫైన్ వేశారు.

క్రికెట్ కోర్టుకేసి చూశాను.

ఇప్పుడక్కడ క్రికెట్ పిచ్ లేదు. ఏదో బిల్డింగ్ కట్టేశారక్కడ. నేను లెఫ్ట్ ఆర్మ్ ఫాస్టు బౌలర్‌ని. నేను ఇన్నింగ్స్ ఓపెన్ చేస్తుంటే చాలామంది బాటు పుచ్చుకోడానికి కంగారుపడి చచ్చేవాళ్లు. ఆ రోజులైపోయినాయి. నేను క్రికెట్ ఆడ్డం మానేసి కూడా చాలా రోజులైంది. ఇంట్రస్టు పూర్తిగా చచ్చిపోయింది.

పరాసుపేట మీదుగా భాస్కరపురం వేపు వెళ్ళాను.

రిజిస్ట్రార్ ఆఫీసుదగ్గిర కెళ్ళేసరికి నాకు చిన్నమ్మ గుర్తుకొచ్చింది. చిన్నమ్మ నా క్లాసుమేటు. నాకూ చిన్నమ్మకి బొత్తిగా పడేదికాదు. నా షోకు తనకి నచ్చేదికాదు. దాని టెక్కుని నేను సహించేవాడిని కాదు. కల్చరల్ వీక్స్‌లో ఓ రాత్రి చిన్నమ్మ ఇంటికెళుతుంటే రాఘవ, నేనూ వెంటపడ్డాం. రాఘవగాడు సైకిల్ ముందు కూర్చున్నాడు. నేను తొక్కుతున్నాను. చిన్నమ్మ జడ లాగమని చెప్పాను రాఘవకి. కానీ రాస్కెల్ ఆరోజు కొంపముంచేశాడు. చిన్నమ్మ గుండెలమీద చెయ్యివేశాడు. ఆ సమయంలో చిన్నమ్మ కళ్ళల్లో తళుక్కు

మని మెరిసిన కన్నీటి పొరల్ని నేనెప్ప టికీ మర్చిపోలేను. అమానుషంగా ప్రవర్తించిన రాఘవని చచ్చేట్టు తిట్టాను నేను.

చిన్నమ్మ మొహం చూడాలంటే నాకు చాలా సిగ్గనిపించింది.

చిన్నమ్మ ఇప్పుడు అమెరికాలో వుంది.

రాఘవగాడు మోటర్ సైకిల్ ఏక్సి డెంట్లో చచ్చిపోయాడు.

తిరిగి తిరిగి మళ్ళీ చంద్రం బాబాయ్ హోటల్ దగ్గర కొచ్చాను.

బాబాయ్ అడిగాడు-

"పెళ్ళయిందా ?"

"ఆఁ మా అక్కయ్య కూతుర్నే చేసుకున్నాను. ఓ వెధవ కూడా తయారయ్యాడు" అన్నాను.

బాబాయ్ నవ్వేడు.

"అయినా నీ అల్లరి పోయినట్టు లేదురా," అన్నాడు.

చంద్రంబాబాయ్‌తో మాట్లాడ్తుంటే చాలా హోమ్లీగా వుంటుంది. ఏ సమయంలో అక్కడ హోటల్ పెట్టాడో గానీ అందరికీ అతను బాబాయ్ వరస వాడే అయిపోయాడు.

నేను నవ్వేను.

బాబాయ్ అడిగాడు-

"గంగాభవాని గుర్తుందా ?" అని.

"ఆహా ఁ..." అన్నాను.

"అది డేనియల్‌గాడ్ని పెళ్ళిచేసుకుంది" చెప్పాడు.

నాకు ఆశ్చర్యమనిపించలేదు. కారణం అలా జరుగుతుందని నాకు తెలుసు. పదేళ్ళక్రితం నాకు తెలిసిన వాళ్ళగురించి చెప్పడానికి చంద్రం బాబాయ్ ప్రయత్నం చేస్తున్నాడు.

"చిలకలపూడి సంబరాలు జరుగుతున్నాయి రాకూడదూ ?" అన్నాడు చంద్రం.

కార్తీకమాసంలో చిలకలపూడి తిరనాళ్ళు జరుగుతాయి. వెన్నెల రోజున సముద్ర స్నానాలు చేస్తారు- ఆ సీజన్లో నాకు క్షణం తీరికుండేది కాదు.

నేను, రాఘవ, శివానందం, గోపు కలిసి గుడిదగ్గర బీటు వేసేవాళ్ళం. చుట్టుపక్కల పల్లెల్నుంచి వచ్చిన ఆడపిల్లల వెనకచేరి, వాళ్ళని రాసుకుని పూసుకొని తృప్తిపడేవాళ్ళం. అన్నింటికంటే బిట్టర్ ఎక్స్పీరియన్స్ఏమిటంటే ఓసారి ఓ అమ్మాయి మాతో రావడానికొప్పుకుంది. దాన్ని రాఘవగాడే కదిలేశాడు. ఇలాంటివాటిలో వాడు ఫస్ట్. ఆ అమ్మాయిని నక్కలతోటలో రాఘవగాడి రూంకి తీసుకెళ్ళాం.

అమ్మాయి తన పేరు సావిత్రని చెప్పింది.

"తప్పుకదా"ఇలా రావడం అని అడిగాను!

సావిత్రి నవ్వింది. నలుగురు కుర్రాళ్ళం ఎదురుగావున్నా సావిత్రి బెదర్లేదు, సిగ్గుపడలేదు.

"సంవత్సరానికో సారిలా తిరనాళ్లకి రావడం నాకలవాటే. నాతోపాటు అమ్మమ్మ వస్తుంది. అమ్మమ్మకి దేవుడి పిచ్చి. నాకు స్టూడెంటు కుర్రాళ్ళంటే యిష్టం," అంది.

"నీకు పెళ్ళికాలేదా ?" అడిగాను.

సావిత్రి మంగళసూత్రాలు చూపించింది.

మొగుడు పొలంపని చేస్తాడనీ,రోతగా వుంటాడనీ చెప్పింది. సావిత్రి తను పతివ్రతను కాదని తనకు తానుగా చెప్పుకున్నాక మేం చేస్తున్నపని తప్పు కాదనిపించి కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాము.

తర్వాత సావిత్రిని గుడిదగ్గర వదిలేశాం. ప్రతిఫలాన్ని ఆశించకుండా ఆడది వెంటొస్తాను అంటే వద్దనడం మగతనానికే సవాల్.

సముద్ర స్నానాలు జరిగేచోట జనం ఎవరి గొడవల్లో వాళ్ళుంటారు. ఆడపిల్లలు నీళ్ళలో మునగ్గానే పక్కనే నీటిలో మునిగి వాళ్ళని పట్టుకునేవాళ్లం. ఆ వారం రోజులు చివాట్లు తింటూ ఆనందంగా గడిపేసేవాళ్ళం. అదంతా గుర్తుకొచ్చి నవ్వు వచ్చింది.

"ఏం మాట్లాడవ్ ?" అన్నాడు చంద్రం.

"ఇదివరకు తిరనాళ్ళకి వెళ్తే తిట్టేవాడివి. ఇప్పుడు నువ్వే పిలుస్తున్నావ్," అన్నాను.

చంద్రం అన్నాడు.

"ఒరే రంగా, అప్పట్లో అన్నిరకాలుగా అందరం పెద్దరికంలో నిన్ను మందలించబట్టే ఈ రోజు హైకోర్టు ప్లీడరివి కాగలిగావు. ఇప్పుడు నీకు వయసొచ్చింది. పెళ్ళాం వచ్చింది. కొడుకు పుట్టాడు. సంసారం వుంది. ఇప్పుడు నువ్వు ఒకరికి చెప్పే స్థాయి కొచ్చేవు."

చంద్రం అన్న మాటలు నిజమే.

నేను చేసిన చిలిపి పనులకి సిగ్గనిపించింది జ్యోతికివన్నీ చెబితే ఏమంటుందో. అసలే తిక్కమనిషి. తిరిగి పుట్టింటి కెళ్ళిపోతుంది.

తనకది పుట్టిల్లయినా నాకు సొంత అక్క ఇల్లు. కానీ నాకు బావంటే ఈ రోజుకీ చచ్చేభయం. ఆయనకి అయిదుగురు కూతుళ్ళు. అయిదుగురూ పంచరత్నాలే. ఏ కూతురి మీదన్నా పొరపాటున 'ఈగ' వాలిందని తెలిసినా చంపేస్తాడాయన.

రాత్రి సిటీ బస్సెక్కి వడ్లమన్నాడు దిగాను.

అక్కడ్నుంచి పొలంగట్లవెంట మూడుమైళ్లు నడవాలి.

వెన్నెట్లో నడక బాగానే వుంది. సిటీలో స్కూటరు కలవాటుపడినా

స్మృతుల పథంలోపడ్డ నాకు నడక ఈజీ గానే వుంది.

నాకు ముందు రెండు ఎడ్లబడ్లు నడుస్తున్నాయి.

వర్షాలు లేకపోవడంచేత దారికూడా బాగానే వుంది. "జ్యోతి"ని కూడా తీసుకొస్తే బాగుండే దనిపించింది.

ప్రతి వేసవి శలవలకి మామయ్య వూరుకొచ్చేవాడ్ని. నాకు ముంజెకాయ లంటే చచ్చేంత ఇష్టం. పాలేరు గంగన్నతో కాయలు కొట్టించుకొని పొలం గట్టుమీద కూర్చుని తినేవాడిని

చెరువుగట్టు సమీపించాను.

అనుకోకుండా నా కాళ్లు అక్కడ ఆగిపోయాయి.

చిన్నప్పుడు గేలంతో చిన్న చేపల్ని పట్టి, చెంబులో పెట్టి ఇంటికి తీసుకెళితే మామయ్య చెవిమెలిపెట్టాడు.

మెల్లగా నడుస్తూ రావిచెట్టు దాటి రామమందిరం దగ్గిరకి చేరాను. రామ మందిరానికీ మామయ్య ఇంటికీ మధ్య దూరం వంకగజాలు చాందినీ కట్టిన పెద్ద పందిరి. పెట్రోమాక్సు దీపాల్తో వెలిగిపోతోంది.

నన్ను చూస్తూనే మామయ్య ఎదురొచ్చాడు.

"ఏరా! ఎంత పెద్ద డ్డిగ్రీవయితే మాత్రం నా కూతురి పెళ్ళికి రావటం ఇంతాలస్యమా?" అన్నాడు.

ఆ రాత్రి రెండుగంటల తర్వాత సుభద్ర పెళ్ళయిపోయింది.

బద్ధకంగా పెళ్ళిపందిరిలోనే వున్న ఈజీ చైర్లో పడి నిద్రపోయాను.

ఉదయం మెలుకువ వొచ్చేసరికి ఫలహారాలు చేస్తున్నారందరూ. నేను కార్యక్రమాలన్నీ ముగించుకొని పందిరిలోకి వచ్చేను.

ఉప్మా తిని కాఫీ తాగి మెల్లగా రామమందిరం దగ్గరకెళ్ళాను. దేవుడికి నమస్కారం చేసి మండపం దగ్గరికి వెళ్ళబోతూ ఆగిపోయాను. మండపం మెట్లపైన కూర్చుని నావంకే తదేకంగా చూస్తున్న ఓ ముప్ఫైఏళ్ళ స్త్రీని గమనించాను.

నావంక ఎందుకలా చూస్తోంది? ఎక్కడో చూసినగుర్తు. లీలగా గుర్తుకొస్తోంది.

దగ్గరగా నడుస్తూ,

"నువ్వు లక్ష్మివి కదూ అన్నాను.


ఆ మాట అన్నానో లేదో లక్ష్మి రెండుచేతుల్లో మొహాన్ని కప్పేసుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

నాకు కంగారు కలిగింది.

"ఏయ్! ఎందుకేడుపు?" అన్నాను.

"నేను లక్ష్మినే. నన్ను గుర్తుపట్టారు బాబు. నాకదే చాలు" అంది.

నేను మెట్లపైన కూర్చుంటూ అడిగాను



"పెళ్ళయిందా? నీ మొగుడేం చేస్తున్నాడు?" అని.

"పెళ్ళికాలేదు," అంది నిర్లిప్తంగా.

"ఎందుకని?"

లక్ష్మి అదోలా నవ్వింది.

"ఈ తనువు నో మా రాజుకిచ్చి మరోడ్ని మనవాడనా ప్లీడరుబాబు!" అంది.

నాకు చెర్నకోలాతో వీపు పగిలేలా కొట్టినట్టయింది.

మండపానికి పది గజాల దూరంలో ఆడుకుంటున్న కుర్రాడ్ని దగ్గరగా పిలిచింది లక్ష్మి.

"ఇడుగో! వీడు నా బిడ్డ" అంది.

వాడి మొహంలోకి భయం భయంగా చూసేను.

అన్నీ నా పోలికలే. ఆ క్షణంలో నా కాళ్ళ కింద భూమి కదిలిపోతున్నట్టుగా అనిపించింది.

"ఇక్కడందరికీ తెలుసా?" అన్నాను.

అలా అడుగుతున్నప్పుడు నా గొంతు భయంతోనూ, స్వార్థంతోనూ, నిండిపోయింది.

లక్ష్మి నవ్వింది

ఆ నవ్వువెనక లక్ష్మి ఎంత నరకాన్ని అనుభవించిందీ నాకు అర్థమయ్యింది.

"మారాజు బిడ్డవి నువ్వు నిన్నల్లరి పెట్టడం ఇష్టంలేక ఎవరేమన్నా నా పీక నొక్కేసుకున్నాను. మనువు లేకపోయినా నీ బిడ్డకి తల్లినై మోడునై పోయి బతుకుతున్నాను రంగబాబూ" అంది.

ఆ క్షణంలో లక్ష్మిపైన నాకు విపరీతమైన గౌరవం పెరిగిపోయింది. చదువు సంధ్యల్లేని పల్లెటూరి మనిషే అయినా, ఓ పేదరైతు కూతురైనా లక్ష్మిలో గల సంస్కారం నన్ను పాతాళానికి తోసేస్తోంది

ఆ పదేళ్ళ కుర్రాడినీ ఎత్తి నా గుండెలకి హత్తుకోవాలనిపించింది. కానీ అశక్తుడ్ని.

నా చేతులకి ఎప్పుడో సంకెళ్ళు పడ్డాయి.

లక్ష్మికేసి జాలిగా చూశాను. మరేం మాట్లాడలేకపోయాను.

చాలా చాలా అడగాలనీ, మాట్లాడాలనీ వున్నా అక్కడుండలేకపోయాను.

నేను అక్కడ్నించి వచ్చేస్తుంటే లక్ష్మి కన్నీళ్ళతో నన్ను చూడ్డం గమనించాను.

బి ఏ. చదివే రోజుల్లో మామయ్య వాళ్ళ వూరొచ్చేను. ఆ రోజు రాత్రి నాకు నిద్రపట్టలేదు.

అత్తయ్య, పిల్లలు గుడిలో జరుగుతున్న హరికథా కాలక్షేపానికి వెళ్ళారు. మామయ్య లోపల నిద్రపోతున్నాడు.

పక్కనే చాపమీద లక్ష్మి నిద్రపోతోంది.

లక్ష్మి చలమయ్య కూతురు. చలమయ్య మామయ్య పొలాన్ని కౌలుకు చేస్తున్నాడు చలమయ్య ఏదన్నా వూరెళితే లక్ష్మి ఒంటరిగా వుండలేక, మామయ్య వాళ్ళింట్లో పడుకునేది

లక్ష్మి వెల్లకిలా పడుకొనుంది. పవిట చెదిరిపోయింది లక్ష్మి గుండెలు నన్ను ఆహ్వానిస్తున్నాయి. మోకాళ్ళవరకూ చెదిరిపోయిన చీర నాలో ఆవేశాన్ని రెచ్చగొట్టింది. మెల్లగా అదురుతున్న గుండెతో లక్ష్మి పక్కన జేరి మీద చెయ్యి వేశాను.

లక్ష్మి కళ్ళువిప్పింది. నన్ను చూసింది లేవపోయింది. లక్ష్మిని కదలకుండా పట్టుకున్నాను. నా కళ్ళల్లో ఏం చూసిందోగానీ లక్ష్మి మరేవిధమైన అభ్యంతరం చెప్పలేదు.

ఆ రోజు జరిగిన ఆ చిన్న పొరపాటు ఈ రోజున ఇంత భయంకరమైన పరిస్థితి ఎదురు నిల్చేలా చేస్తుందని నేను కలలోకూడ అనుకోలేదు.

ఆ తరువాతసలు నేను లక్ష్మిని మర్చిపోయాను.

నాకు వూళ్ళో మరొక్కక్షణం వుండబుద్ధి కాలేదు.

బ్రీఫ్‌కేసులోంచి చెక్‌బుక్కు తీసి వెయ్యి రూపాయలకి చెక్కురాసి లక్ష్మికి పంపాను.

మామయ్య, అత్తయ్య ఎంత చెప్పినా వినకుండా బయల్దేరాను.

పొలంగట్టుమీద తలవంచుకొని వేగంగా నడుస్తున్నాను.

ఇంతలో పొలంగట్ల కడ్డంపడి లక్ష్మి

పరిగెత్తుకొచ్చి నాకు ఎదురుగా నించొంది.

లక్ష్మి చేతిలో నేను రాసిచ్చి పంపిన చెక్కు వుంది.

లక్ష్మి నాకేసి చూస్తూ నించొంది. లక్ష్మి కళ్ళల్లో నీరు గిర్రున తిరుగుతోంది.

చేతిలోవున్న చెక్కుని అటు ఇటు తిప్పి చూసింది.

తర్వాత ముక్కలు ముక్కలుగా చింపేసింది.

లక్ష్మి చాలా ఆవేశంగా అంది.

"వెయ్యి రూపాయల్తో నా జీవితాన్ని, నీవల్ల నా కడుపున పుట్టిన బిడ్డ భవితవ్యాన్ని, సరిచేశాననుకుంటే చాలా సంతోషం రంగబాబు ! నీ డబ్బుని నేనే నాడూ ఆశించలేదు. నా బిడ్డని నేను పెంచుకోగలను. కన్న తండ్రెవరో ఆడికి తెలీకపోయినా, ఈ వూళ్ళోవాళ్ళకి తెలీకపోయినా, నాకు తెలుసు. నువ్వెప్పుడన్నా కనబడితే నీకు చెప్పాలనే నేనింతవరకు గుండెల్లోని ఈ బాధని సహిస్తూ ఎదురుచూశాను. ఈ లక్ష్మి నీకు గుర్తులేకపోయినా ఫర్లేదు. కానీ నువ్వెక్కడున్నా నీ పెద్దకొడుకు ఇక్కడున్నాడని మాత్రం మర్చిపోకు." అని వెనక్కితిరిగి గబగబ వెళ్ళిపోయింది లక్ష్మి.

నేను అయోమయంగా నించుండి పోయాను.

లక్ష్మిలో గల సంస్కారం నన్ను అదిలించేసింది.

కానీ నేనేం చెయ్యను ?

భారంగా కదిలేను.

మా ఊరు బందరు. అక్కడ సముద్రముంది. అక్కడ గాలి చల్లగా బాగుంటుంది. సవువు తోటలున్నాయి. మైదానాలు, ఆహ్లాదాన్ని కలిగించే పచ్చికబయిళ్ళు వున్నాయి.

పుట్టిపెరిగిన ఈ వూరునీ, మంచినీ, మంచిని పెంచుకొన్న లక్ష్మిలాంటి మనుష్యుల్ని వదిలి ఎక్కడో కృత్రిమంగా బతుకుతున్న నాదీ జీవితమేనా ?

"అయాం గిల్టీ," అనుకున్నాడు.

బస్సు కదిలింది.

దూరం అయిపోతున్న నా ఊరునీ అక్కడి పరిసరాలనీ చూడాలంటే భయంవేసింది. కళ్ళుమూసుకుని నా సీటులో వెనక్కిజారిపోయాను.

